మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి

మంగళవారం 8 అక్టోబరు 2024 పేజీలు 8

## ప్రజావాణికి 35 దరఖాస్తులు




**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** ప్రజావాణి ద్వారా వచ్చే దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయములోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 35 మంది తమ సమస్యల పరిష్కరం కోసం దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి.లక్ష్మి నారాయణ, నర్సింగ్ రావు లతో కలసి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మార్పు ఇద్దరమ్మా రాజ్యంతోనే సాధ్యం...

- ఎన్నికలు ఇచ్చినా ప్రతి హామీని నెరవేరుస్తాం...
- స్మార్ట్ కార్డు తోనే అన్ని సంక్షేమ పథకాలు....
- రుణమాఫీ కానీ రైతులు అధైర్య పడొద్దు.....
- ప్రతి రైతుకు రుణమాఫీ చేసి తీరుతాం.....
- వివిధ అభివృద్ధి, శంకుస్థాపన పనులు ప్రారంభం....
- రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి...



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** పేద ప్రజల బతుకుల్లో మార్పు ఇందిరమ్మ రాజంతోనే సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని 43 కోట్ల 32 లక్షలతో వివిధ అభివృద్ధి, శంకుస్థాపన పనులను స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతామని పేర్కొన్నారు, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసిన సీఎం రేవంత్ రెడ్డి దానిని అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. రైతు రుణమాఫీ కోసం 36 వేల కోట్లకు గాను 18 వేల కోట్లు రైతుల అకౌంట్లో జమ చేసినట్లు తెలిపారు. వివిధ కారణాలతో కొంతమంది రైతులకు రుణమాఫీ కానీ మాట వాస్తవమని త్వరలో దానిని కూడా పూర్తి చేస్తామని చెప్పారు. రైతులు ఎవరు అధైర్య పడద్దని ప్రతి రైతుకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు, అవసరమైతే మరో 13 వేల కోట్లు కేటాయించి రైతులందరికీ ఇబ్బందులు కలవకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ధరణి ప్రక్షాళన చేస్తామని అదేవిధంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే దానికోసం కుటుంబ డిజిటల్ స్మార్ట్ కార్డును తీసుకువస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజల కోసం పనిచేస్తుందని పునరుద్ఘరించారు. ఆరు గ్యారంటీలలో ఐదింటిని ఇప్పటికే అమలు చేయడం జరిగిందన్నారు. నిరుద్యోగ యువతకు 61 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని, నిరుద్యోగుల కు ఇచ్చిన మాటను తప్పకుండా అమలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తిలో ఆర్డీవో కార్యాలయం, ఆర్ అండ్ బి బిల్డింగ్ ఏర్పాటుకు సహకరించాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి ఈ సంవత్సరంలోనే ఆర్డిఓ ఆఫీస్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్, మున్సిపల్ చైర్మన్ సత్యం, నాయకులు ఆనంద్ కుమార్, వివిధ వార్డుల కౌన్సిలర్లు గోరటి శ్రీనివాసులు, బాలు నాయక్, ఎజాస్, లక్ష్మీ రాంరెడ్డి, చందన శ్రీధర్ రెడ్డి, విజయలక్ష్మి, చైతన్య కిషోర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, చిమ్మల శ్రీకాంత్ రెడ్డి, జిల్లెల్ల రాములు, ఆర్డీవో శ్రీను నాయక్, తాసిల్దార్ ఇబ్రహీం, ఎంపీడీవో వెంకట రాములు, ఏఈ శ్రీను నాయక్, చంద్రకాంత్ రెడ్డి, సంతు యాదవ్, జమ్ముల శ్రీకాంత్, బొమ్మ ఆంజనేయులు, దున్న సురేష్, పడకంటి వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# స్కందమాత దేవిగా జోగులాంబ అమ్మవారు

- అమ్మవారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు
- భక్తుల కోరికలు తీర్చే తల్లి జోగులాంబ



**అలంపూర్ మేజర్ న్యూస్:** కార్తికేయుడు, శక్తిధరుడు అని ప్రసిద్ధుడైన స్కందుని తల్లి యైన దుర్గాదేవిని 'స్కందమాత'పేరున నవరాత్రులలో 5వ రోజున ఆరాధింతురు. ఈమె చతుర్భుజ. షణ్ముఖుడైన బాలస్కందుని ఈమెయొడిలో ఒక కుడిచేత పట్టుకొనియుండును. మరియొక కుడిచేత పద్మము ధరించియుండును. ఎడమవైపున ఒకచేత అభయముద్ర, మరొకచేత కమలము ధరించి, 'పద్మాసన' యనబడు ఈమెయు సింహవాహనయే. స్కందమాతను ఉపాసించుటవలన భక్తుల కోరికలన్నియు నెఱవేఱును. ఈ మర్త్యలోకమునందే వారు పరమ శాంతిని, సుఖములను అనుభవించుదురు. స్కందమాతకొనర్చిన పూజలు బాల స్కందునకు చెందును. ఈ దేవి సూర్య మండల–అధిష్ఠాత్రి యగుటవలన ఈమెను ఉపాసించువారు దివ్య తేజస్సుతో, స్వచ్ఛకాంతులతో వర్ధిల్లుదురు. అమ్మవారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు... అష్టదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి అమ్మవారు తొమ్మిది రోజులపాటు మీద రూపాలలో భక్తులకు దర్శనం ఇస్తుంటారు. సోమవారం ఐదవ రోజు జోగులాంబ దేవి అమ్మవారు భక్తులకు స్కందమాత దేవిగా భక్తులకు దర్శనమిచ్చి భక్తుల పూజలు అందుకున్నారు. నవరాత్రులలో సోమవారం కావడంతో వివిధ దూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు జోగులాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు చండీహోమాలు నిర్వహించారు. నవరాత్రులలో జోగులాంబ దేవి అమ్మవారిని దర్శించుకుంటే మనసులో అనుకున్న కోరికలు నెరవేరుతాయి అని భక్తులు తమ కోరికలను అమ్మవారి దర్శనం అనంతరం వారి ముడుపులను అమ్మవారికి సమర్పించారు. అష్టదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి అలంపూర్ పుణ్యక్షేత్రంలోని మరియు దక్షిణ కాశీగా పిలవబడే బాల బ్రహ్మేశ్వర స్వామి లు ఈ ప్రాంతంలో వెలసి ఉండడం ఈ ప్రాంత ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరూ చేసుకున్న పుణ్య ఫలాలని భక్తుల యొక్క నమ్మకం. ఆలయాలలో భక్తుల సౌకర్యార్థం కొరకు ఆలయ అధికారులు కుంకుమార్చన పూజలు అభిషేకాలు చండీహోమ పూజలను ఏర్పాటు చేసి భక్తులు దర్శనానంతరం అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. **తుంగభద్రమ్మకు హారతులు...** దేవి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా 5వ రోజు జోగులాంబ అమ్మవారు స్కందమాత దేవిగా భక్తులకు దర్శనం ఇవ్వడంతో ఉదయం తెల్లవారుజామునే భక్తులు జోగులాంబ దేవి బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల సమీపంలోని ఉన్న తుంగభద్రా నదిలో పుణ్యస్నానం ఆచరించి తుంగభద్ర నదికి మహిళలు దీపాలను వెలిగించి హారతులను ఇచ్చారు. తుంగభద్రా నదిలో స్నానమాచరిస్తే చేసుకున్న పాపాలు తొలగిపోతాయని భక్తులు ప్రత్యేకంగా తుంగభద్ర పుష్కర ఘాటు నందు పూజలను నిర్వహించి దీపాలను తుంగభద్రా నదిలో వదిలేశారు. స్కందమాత దేవిగా అమ్మవారు సోమవారం భక్తులకు దర్శనం ఇవ్వనున్నాడంతో వేలాదిమందిగా తరలివచ్చిన భక్తులు తుంగభద్రా నది దగ్గర పుణ్యస్నానం ఆచరించడంతో పుష్కర ఘాటు నందు వేలాది మంది భక్తులతో కిటకిటలాడాయి. రాత్రి జోగులాంబ అమ్మవారి ఆలయంలో అమ్మవారు స్కందమాత దేవిగా భక్తులకు దర్శనం ఇవ్వడంతో ఆలయ అర్చకులు వేదమంత్రాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలలో వివిధ దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొని అమ్మవారి దీవెనలు పొందారు.

## డిసిసిబి నూతన సహకార బ్యాంకు భవనం ప్రారంభం



**ఎర్రవలి మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి చైర్మన్ మామిళ్ళ విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా వచ్చి సోమవారం ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు బ్యాంకు యొక్క సేవలను సద్వినియోగపర్చుకోవాలన్నారు మరియు బ్యాంకు రుణాలను సమయానుగుణంగా చెల్లించాలన్నారు బ్యాంకు ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండిబ్యాంకు ని అభివృద్ధి చేయవలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఈ రంగారెడ్డి. సీఈవో పురుషోత్తంరావు. ఏజీఎం శ్రీనివాస్. రమేష్. శ్రీనివాస్ రెడ్డి. గ్రంథాల చైర్మన్ శ్రీను. మేనేజర్ రాధా బాయ్. మాజీ సర్పంచ్ రవి. హనుమంత్ రెడ్డి. రైతులు గ్రామస్తులు బ్యాంకు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## పత్తి వ్యాపారస్తులను పరామర్శించిన ఎమ్మెల్యే విజయుడు



**అలంపూర్ మేజర్ న్యూస్:** సోమవారం వడ్డేపల్లి మండలానికి చెందిన పత్తి వ్యాపారి కర్నూలు జిల్లాలో పత్తి కొనుగోలు చేసి శాంతినగర్ కి తీసుకు వస్తుండగా కర్నూలు జిల్లా కొంతలపాడు గ్రామ సమీపంలో అదుపుతప్పి బొలెరో వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే వడ్డేపల్లి మండలం తుమ్మాసిపల్లె గ్రామానికి చెందిన జమ్మన్న,జ్ఞానవంతుడు మృతి చెందారు. కర్నూల్ లోని గవర్నమెంట్ హాస్పిటల్ అదే బొలెరో లా ఉన్న నలుగురుకి గాయాలు అవ్వగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు వెంటనే ఉటాహుటిన హాస్పిటల్ కి వెళ్లి బాధితులను పరామర్శించడం జరిగినది. బాధితులను అన్ని విధాల ప్రభుత్వం నుండి ఆదుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే తో పాటు నాగేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,పుల్లూరు రఘురెడ్డి,రామ్,శీను,తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఇంటర్ స్క్వాడ్ స్పోర్ట్స్ మీట్



**జోగులాంబ గద్వాల:** జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదవ పటాలంలో గత వారం రోజులుగా జరుగుతున్న ఇంటర్ స్క్వాడ్ స్పోర్ట్స్ మీట్ సోమవారం రాత్రి ముగిసింది ఈ సందర్భంగా పటాలం కమాండెంట్ సాంబయ్య మాట్లాడుతూ ట్రైనింగ్ లో భాగంగా పోలీస్ శిక్షణ సమయంలో గేమ్స్ పెట్టుకోవడం వల్ల మానసిక ఉల్లాసం మనిషి దృఢత్వం ఫిజికల్ ఫిట్నెస్ సాధించవచ్చు అన్నారు ఆటలపై మక్కువ పెంచుకోవాలన్నా ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి వ్యక్తి క్రీడలపై మక్కువ పెంచుకోవాలి అన్నారు 13 ఈవెంట్లు నిర్వహించామని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్ సీల్డ్ మెమొంటోస్ అందజేశారు ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ సుబ్రహ్మణ్యం. అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్.ఆర్ఐ రాజారావు. గోపాల్.వెంకటేశ్వర్లు. బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైలం ఉత్తర ద్వార ముఖ శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ చైర్మన్ మరియు పాలకమండలి సభ్యులుగా ప్రమాణస్వీకారం.

**- ఆలయ చైర్మన్ గా బీరం మాధవరెడ్డి ప్రమాణ స్వీకారం.**

**- హాజరైన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.**





**అచ్చంపేట మేజర్ న్యూస్(అక్టోబర్ 7):** అచ్చంపేట మండల పరిధిలోని శ్రీశైల ఉత్తరముఖ ద్వారమైన శ్రీ ఉమామహేశ్వర పుణ్యక్షేత్ర ఆలయ చైర్మన్గా అచ్చంపేట మండలం పులిజాల గ్రామానికి చెందిన బీరం సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మరియు డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులుగా నియమితులైన వారిని నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునుంతల మండలానికి చెందిన బొల్లె లక్ష్మయ్య, మరియు కట్ట శేఖర్ రెడ్డి మరియు దాశరథి పవన్ కుమార్ను శాలువాతో సన్మానం చేసిశుభాభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలోమండల పార్టీ అధ్యక్షులు కట్ట అనంత రెడ్డి , నాయకులు రఘుపతి రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, చింతగాళ్ళ శ్రీను, తిరుపతయ్య, అమరేందర్ రెడ్డి, గుద్దటి బాలరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆలయ అర్చకులు ,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఫార్మా కంపెనీ ఏర్పాటును అడ్డుకుంటాం..

**- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి..**



**కోస్గి మేజర్ న్యూస్:** రైతులు తమ భూములను ఫార్మా కంపెనీల కోసం ఇవ్వమని తెగేసి చెబుతున్న ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తున్నదని,ఫార్మా కంపెనీ ఏర్పాటును అడ్డుకుని తీరుతామని కొడంగల్ మాజీ శాసనసభ్యుడు పట్నం నరేందర్ రెడ్డి అన్నారు.సోమవారం కోస్గిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రైతులు తమ పొలాలను ఫార్మా ఏర్పాటుకు ఇవ్వమని అంటున్న,ఎవరి లాభం కోసం ఫార్మా కంపెనీ లను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు.పచ్చని పొలాలను కలుషితం చేసే ఫార్మా ను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూన్నా ముఖ్యమంత్రి ఫార్మా కంపెనీ లను ఇక్కడే పెడతామని చెప్పడం ఎవరి స్వలాభం కోసమని అన్నారు.ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా హామీల అమలు ఎందుకు చేయడం లేదన్నారు.రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని అన్నారు.ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇంతవరకు రైతుల ఖాతాలలో రైతుబందు ఎందుకు వేయలేదో రైతులకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.ఫార్మా కంపెనీ ఏర్పాటును నిరసిస్తూ ఈనెల 9న పోలేపల్లి ఎల్లమ్మదేవి ఆశీస్సులతో రైతులకు మద్దతుగా పాదయాత్ర చెప్పట్టనునట్లు ఆయన తెలిపారు. ఈ పాదయాత్రలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి,పాల్గొంటారని అన్నారు.పాదయాత్ర పోలేపల్లి,పులిచర్ల తండా,లగచర్ల గ్రామాల మీదుగా దూద్యల్ మండల కేంద్రానికి చేరుకుని తహసీల్దార్ కు వినతి పత్రం అందజేస్తామని అన్నారు.అనంతరం బిఆర్ఎస్ నాయకులు శ్యాసం రామకృష్ణ మాట్లాడుతూ రైతులకు మద్దతుగా చేపట్టే ఫార్మా వ్యతిరేక ఉద్యమంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు ఎండి సలీం,కోట్ల మహిపాల్, వెంకట్ నర్సములు,జనార్దన్ రెడ్డి, పోషప్ప,కోనేరు సాయప్ప,మోహన్ గౌడ్ తదితరులున్నారు.

## కోస్గి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ఎండి హాజీ...



**కోస్గి మేజర్ న్యూస్:** కోస్గి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా కోస్గి పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకుడు ఎండి హాజిని డైరెక్టర్ గా నియమించారు. సోమవారం మండల మైనారిటీ నాయకులు ఎండి సలీం, ఎండి ఫెరోజ్, హాజులు తదితరులు నూతన డైరెక్టర్ గా ఎన్నికైన హాజిని పూలమాలలు శాలువాలతో సన్మానించారు. సందర్భంగా నూతన డైరెక్టర్ హాజీ మాట్లాడుతూ మైనార్టీ వర్గానికి చెందిన తనకు మార్కెట్ కమిటీ లో స్థానం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తిరుపతి రెడ్డి గార్లకు కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి సభ్యునిగా రైతుల సంక్షేమ ధ్యేయంగా, వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరిగేలా చర్యలు....

**- నారాయణ పేట్ కలెక్టర్ సిక్త పట్నాయక్..**



**కోస్గి మేజర్ న్యూస్::** కోస్గి ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలని నారాయణ పేట్ కలెక్టర్ సిక్త పట్నాయక్ అన్నారు.సోమవారం కోస్గి పర్యటనలో భాగంగా ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోస్గి దవాఖానలో రోజు ఎంత ఓ పి వస్తుంది,ఎన్ని కాన్పులు జరుగుతున్నాయి అనే విషయాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో డాక్టర్లు ఎంతమంది ఉన్నారని,అవసరమైన మేరకు ఇంకా డాక్టర్ లను పంపించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోజు 200 నుండి 250 మధ్యలో ఒపి చేస్తున్నామన్నారు, ప్రస్తుతం ఎనిమిది మంది డాక్టర్లు ఉన్నారని వైద్యులు అనుదీప్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.ప్రతి నెల ఆసుపత్రిలో డెలివరి లు 60 నుండి 70 డెలివరి అవుతునాయన్నారు. గత నెలలో 62 డెలివరి అయ్యాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా ఆసుపత్రిలో ఉన్న మందుల వివరాలను తెలుసుకుని,అవసరమైన మందుల కోసం నివేదికలు పంపాలని వైద్యులకు సూచించారు. వైద్యులు వైద్య సిబ్బంది సకాలంలో హాజరై పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు.ఇంకా ఒపి నీ పెంచాలని, ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్లను ఆదేశించారు. ఆస్పత్రి విభాగాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది శ్రద్ధ వహించాలన్నారు. ఈ సమీక్ష సమావేశం లో ట్రైనీ కలెక్టర్ గరిమ నరుల, కడా అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ మల్లికార్జున్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ సుందరికరణ పనులు త్వరితగతిన చేపట్టాలి...

**- సిడి ఎం ఏ డైరెక్టర్ గౌతమ్,కలెక్టర్ సిక్త పట్నాయక్**



**కోస్గి మేజర్ న్యూస్:** కోస్గి పట్టణ సుందరికరుణ పనులు వేగవంతం చేయాలన సిడిఎంఏ డైరెక్టర్ విపి గౌతం అధికారులను ఆదేశించారు. సోమవారం కోస్గి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ తో కలిసి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కోస్గి పట్టణ సమగ్ర అభివృద్ధి కొరకు ప్రభుత్వం రూ.416.54 కోట్ల వ్యయంతో పట్టణ సుందరీకరణ కై నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు.కోస్గి మున్సిపాలిటీలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల కోరకు మున్సిపాలిటీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్కుల ఏర్పాటు, షటిల్ కోర్టు, శివాజీ చౌరస్తా సుందరీ కరణ, చెరువుల అభివృద్ధి కొరకు ప్రస్తుత పరిస్థితి సీ సి డి ఎం ఏ డైరెక్టర్,కలెక్టర్ సిక్త పట్నాయక్ పట్టణంలో కాలినడకన తిరిగి పరిశీలించారు. చెరువుల సుందరికరణ పనులను త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.పట్టంలోని బీసీ కాలనీ లో టెన్నిస్ కోర్ట్ మరియు బంధం చెరువు,ఉప్పు సముద్రం కట్టల విస్తీరణ తదితర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అన్నారు. సిడిఎంఏ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ మున్సిపల్ ఆఫీస్, ఉప్పుసముద్రం చెరువు, నాగుల బావి, మినీ స్టేడియం కోసం స్థల పరిశీలన అదే విధంగా బిసి కాలనీలోని పంచతంత్ర పార్క్ లను సందర్శించారు.ఈసందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ కుమార్,రఘువర్షన్ రెడ్డి,బెజ్జు రాములు,తుడుం శ్రీనివాస్,మాస్టర్ శ్రీనివాస్,బాల్ రాజ్,శివ ప్రసాద్ తివారి,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మారెమ్మ గుడి నిర్మాణం కోసం ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు.



**శ్రీరంగాపూర్ మేజర్ న్యూస్ :** శ్రీరంగాపూర్ మండలం కాంగ్రెస్ నాయకులు బీరం.రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కంబలపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు మరియు తాండకి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బలరాం నాయక్ సోమవారం మెగారెడ్డి నెత్రుత్వంలో పనిచేస్తానని చెప్పడం జరిగింది.తాండకు సంబంధించిన కుల దైవమైన మారెమ్మ దేవాలయం సంబంధించి గుడి నిర్మాణం కొరకు మరియు వివిధ అభివృద్ధి పనుల కోసం శాసనసభ్యులు మేఘ రెడ్డి ని తాండకు సంబంధించిన నిర్మాణం కోసం నిధులు తప్పకుండా మంజూరు చేస్తానని వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో కంబాలాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్,లక్ష్మయ్య, తెలుగు రాజు,మొలాలి కృష్ణయ్య,,కార్యక్రమం లో సహకారం ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో రమేష్ నాయక్ ,నరసింహ నాయక్ ,స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సెల్ ఫోన్ల అందజేత



**అమరచింత, మేజర్ న్యూస్:** అమరచింత మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన సెల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సోమవారం అమరచింత పోలీస్ స్టేషన్లో ఎస్సై బి. సురేష్ బాధితులకు సెల్ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అమరచింత మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 58 మంది సెల్ఫోన్ బాధితులు పోలీస్ స్టేషన్లో సెల్ ఫోన్లు పోగొట్టుకున్నామని ఫిర్యాదు చేశారని తెలిపారు. పోగొట్టుకున్న సెల్ ఫోన్ల వివరాలను సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్ లను రికవరీ చేశామని తెలిపారు. ఇప్పటివరకు 44 సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఈరోజు ఆరు మంది బాధితులకు సెల్ ఫోన్ లను అందజేయడం జరిగిందని సురేష్ తెలిపారు. ఇంకా 14 సెల్ ఫోనులు రికవరీ చేసి బాధితులకు ఇచ్చేందుకు పోలీస్ ప్రయత్నాలు జరుగుతున్నావని తెలిపారు.

## మహాలక్ష్మి దేవిగా అమ్మవారు



**నవాబుపేట్ మేజర్ న్యూస్:** దేవి శరన్నవరాత్రులలో భాగంగా నిన్న నవాబుపేట్ మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు 6లక్షల 22వేల 2వందల 22రూపాయల అలంకరణతో అమ్మవారు మహాలక్ష్మిదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కరెన్సీఅమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

### వీరభద్ర స్వామికి

## వెండి కిరీటం బహుకరణ



**కోయిలకొండ మెజర్ న్యూస్ :** మండలంలోని ఆచార్య పూర్ గ్రామ సమీపాన కొండపై వెలసిన వీరభద్ర స్వామికి సోమవారం కోస్గి పట్టణానికి చెందిన బ స్వ రాజమ్మ వారి కుటుంబ సభ్యులు వెండి కిరీటం బహుకరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ . ఒక కిలో 250 గ్రాముల వెండి కిరీటాన్ని స్వామివారికి సమర్పించడం జరిగిందన్నారు. ఒక లక్ష 50 వేల రూపాయల ఖర్చుతో కిరీటా నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు విజయ్ కుమార్ .వీరన్న. రాజేశ్వర్. తదితరులు పాల్గొన్నారు.

## రంగాపురం కృష్ణారెడ్డి గోదాంలో సిసిఎస్ పోలీసుల మెరుపు దాడి..

- రూ : 6.35 లక్షల నగదు.. నాలుగు బైకులు. నాలుగు కార్లు 15 సెల్ ఫోన్లు స్వాధీనం..
- పోలీసుల అదుపులో 15 మంది పేకాట రాయుళ్లు..
- విటులు అంతా రంగాపురం పెబ్బేరు గద్వాల పట్టణాలకు చెందినవారు..
- గత కొంతకాలంగా ఏదేచ్ఛగా పెద్ద ఎత్తున గోదాం లో కొనసాగుతున్న పేకాట స్థావరం..
- గత నాలుగు నెలల క్రితమే ఇక్కడ పేకాట ఆడి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి...
- అయినా పట్టించుకోని పెబ్బేరు పోలీసులు...
- నెలవారి మాముళ్ళు ఇచ్చి
- మేనేజ్ చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణలు..?



**వనపర్తి ప్రతినిధి మేజర్ న్యూస్ :** వనపర్తి జిల్లా పెబ్బేరు మండల పరిధిలోని రంగాపురం గ్రామ శివారులోని కృష్ణారెడ్డి గోదాముల్లో యదేచ్ఛగా నిర్వహిస్తున్న పేకాట సవరం పై సోమవారం సాయంత్రం వనపర్తి సిసిఎస్ పోలీసులు మెరుపు దాడి చేశారు.. పోలీసుల దాడుల్లో పెద్ద ఎత్తున ఆరు లక్షల 35 వేల రూపాయలు 15 మంది పేకాట రాయుళ్లు నాలుగు బైకులు నాలుగు కార్లు 15 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. పేకాట రాయులంతా రంగాపురం పెబ్బేరు గద్వాల నియోజకవర్గనికి చెందినవారుగా పోలీసులు గుర్తించారు గత కొంతకాలంగా రంగాపురం గ్రామంలో ఏ దేచ్ఛగా పేకాట స్థావరాన్ని నిర్వహిస్తున్నప్పటికీ పెబ్బేరు పోలీసులు మాత్రం ఏమి పట్టనట్లుగా విధులు నిర్వహిస్తున్నాడంపై ఏకంగా సిసిఎస్ పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది.. కృష్ణారెడ్డి గోదం లో నిర్వహించే ఈ పేకాట వస్తావరానికి రాష్ట్రంలోని నలుమూలల నుండి కర్నూలు నుండి కూడా పేకాట రాయుళ్లు ఇక్కడికి కార్లలో వచ్చి పేకాట ఆడటంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి గత నాలుగు నెలల క్రితం వనపర్తి పట్టణానికి చెందిన ఒక వ్యక్తి ఇక్కడ పేకాట ముగించుకొని వనపర్తికి వస్తుండగా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందగా మాజీ కౌన్సిలర్ ఒకరు తీవ్ర గాయాల పాలైన సంఘటన మరువకముందే మళ్లీ యదేచ్ఛగా ఇక్కడ పేకాట సవారాన్ని నిర్వహించడంపై ఈ పేకాట స్థావరం వెనక ఎవరున్నారని ప్రశ్న తలెత్తక మానదు.. జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న ఈ గోదాంలో ఇంత పెద్ద మొత్తంలో జూదం కొనసాగుతున్నప్పటికీ పోలీసులు ఏమీ పట్టించుకోకపోవడంతో ఏకంగా జిల్లా ఎస్పీ రంగంలోకి దిగి సిసిఎస్ పోలీసులకు పేకాట స్థావరం సంగతి చూడాలని ఆదేశించినట్టు తెలిసింది... ఇంత పెద్ద మొత్తంలో పేకాట జూదం కొనసాగుతున్నప్పటికీ పెబ్బేరు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారికి పేకాట స్థావరం నిర్వాహకులు నెలవారి మామూలు ఇచ్చి పేకాట జూదాన్ని ఎలాంటి భయం లేకుండా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.. ఈ దాడుల్లో సిసిఎస్ సీఐ రావిపాల్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి పోలీస్ కానిస్టేబుల్స్ స్వామి సమరసింహారెడ్డి మురళి ఉన్నారు సిసిఎస్ సిఐ రావిపాల్ మాట్లాడుతూ పట్టుబడిన పేకాట రాయులను నగదును కార్లు మరియు బైకులు సెల్ఫోన్లను పెబ్బేరు ఎస్సైకి అప్పగించినట్లు తెలిపారు.

## చార్జిషీట్ త్వరగా వేసి న్యాయం చేయండి

- హత్యకు గురైన శ్రీకాంత్ యాదవ్ తండ్రి వెంకటేష్ కలెక్టరుకు పిర్యాదు



**మహబూబ్ నగర్ మేజర్ న్యూస్ :** బండమీదిపల్లిలోని మల్లికార్జున వైన్స్ దగ్గర జరిగిన గొడవలో హత్యకు గురైన శ్రీకాంత్ యాదవ్ కుటుంబ సభ్యులు సోమవారం మహబూబ్ నగర్ కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి హత్య జరిగి ఐదు నెలలు కావస్తున్న ఇంతవరకు చార్జిషీట్ వేయకుండా అసలు నిందితులను కాపాడుతున్నారని బీసీ సమాజ్ నాయకులతో కలిసి వినతిపత్రంలో పేర్కొన్నారు. హత్యకు గురైన శ్రీకాంత్ యాదవ్ తండ్రి వెంకటేష్ మాట్లాడుతూ, కుటుంబానికి పెద్ద దిక్కు అయిన కుమారుడు హత్య విషయంలో పలుమార్లు పోలీస్ వాళ్లను కలిసిన, ఇంతవరకు సరియైన న్యాయం చేయకుండా కాలయాపన చేస్తూ చార్జిషీట్ వేయకుండా అసలు నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నడన్నారని వాపోయారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఏం.శ్రీనివాస్ సాగర్ మాట్లాడుతూ, హత్య జరిగిన రోజు నుంచి అధికారులు, నాయకులు బాధితుల పక్షాన లేకుండా అగ్రవర్ణాలకు వత్తాసు పలుకుతూ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మాట్లాడుతూ ఒక అగ్రవర్ణ బిడ్డకు జరిగితే ఇన్ని రోజులు ఈ కేసు ఉండేదా అని ఆయన ప్రశ్నించారు. తమకు ఇక్కడ న్యాయం జరగకపోతే రాష్ట్ర బీసీ కమీషన్ లో మరియు హ్యూమన్ రైట్స్ లో ఫిర్యాదు చేసి న్యాయపోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కో- కన్వీనర్ సవారి సత్యం, బీసీ సమాజ్ సభ్యులు ఆంజనేయులు, వేణు యాదవ్ ఉన్నారు.

## కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలుచెల్లించాలి-

- గోపాల్ నాయక్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ (ఏఐటీయూసీ)బ్రాంచ్ అధ్యక్షులు.
- ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ కి వినతి పత్రం అందజేత-



**మహబూబ్ నగర్ మేజర్ న్యూస్ :** మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు రావలసిన రెండు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ సోమవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం (ఏఐటీయూసీ) నేతృత్వంలో జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ అధ్యక్షులు గోపాల్ నాయక్ మాట్లాడుతూ,తెలంగాణ పండుగ అయిన విజయదశమి దసరా పండుగకు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పస్తులు ఉండకుండా వారికి రావాల్సిన రెండు నెలల పెండింగ్ వేతనాలు కాలయాపన లేకుండా తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది అరకొర వేతనాలతో ఇబ్బందులలో ఉన్న నేపథ్యంలో అవి కూడా నెలల తరబడి పెండింగ్లో ఉంచితే ఇంటి అద్దెలు నెలవారి ఈఎంఐలు కట్టుకోలేక మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. మానవత దృక్పథంతో పెండింగ్ వేతనాలు తక్షణమే అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం అవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బంది పాండు, ఖాదర్ భూపతి రాజు, మురళి నాగరాజు, కొండమ్మ,సురేఖ,అన్నపూర్ణ,రత్నమ్మ,భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అగ్రహారం పొట్లపల్లి మాజీ సర్పంచ్ ఆర్. అంజిరెడ్డి మృతి



**రాజాపూర్, మేజర్ న్యూస్ :** రాజాపూర్ మండలం అగ్రహారం పొట్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆర్. అంజిరెడ్డి సోమవారం మృతి చెందారు. 1995 సంవత్సరంలో గ్రామ సర్పంచిగా కొనసాగిన ఆయన కొద్దిరోజుల క్రితం అనారోగ్యానికి గురికాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం 10:30 గంటలకు అగ్రహారం పొట్లపల్లి గ్రామంలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయని బంధువులు, బంధుమిత్రులు హాజరై ఆయన ఆత్మకు శాంతి చేకూర్చగలరని కుటుంబ సభ్యులు కోరారు. అంజిరెడ్డి మృతి పట్ల రాజాపూర్ మండలం గుండ్లపొట్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మర్పడగ గోపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి శాంతి చేకూర్చాలని ఆ భగవంతున్ని వేడుకుంటున్నట్లు గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత..కేసు నమోదు ఎస్సై ఆర్ శేఖర్



**చిన్న చింతకుంట, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నెల్లికొండి గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై ఆర్ శేఖర్ తెలిపారు.నెల్లి కొండి గ్రామానికి చెందిన గోవర్ధన్ రెడ్డి కు చెందిన ట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా ముచ్చింతల గ్రామ సమీపంలోని ఊక చెట్టు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్ శేఖర్ తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం



**గోపాలపేట మేజర్ న్యూస్ :** గోపాలపేట మండల కేంద్రానికి చెందిన మండ్ల తిరుపతయ్య అదృశ్యమైనట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు వివరాలు ఇలా ఉన్నాయి గ్రామానికి చెందిన మండల తిరుపతయ్య ఆదివారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలం దగ్గర బోరు మోటర్ బంద్ చేసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు సాయంత్రం వరకు తిరిగి రాకపోయేసరికి పొలం దగ్గర చుట్టుపక్కల ఇండ్లలో గ్రామాల్లో వెతికిన దొరకకపోవడంతో సోమవారం భార్య మండ్ల రామేశ్వరమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# రైతు రుణమాఫీపై పది రోజుల స్పెషల్ డ్రైవ్

- గ్రామాల్లో చాటింపు వేయించండి
- ఫ్యామిలీ గ్రూపింగ్ వెంటనే పూర్తి చేయించండి
- ఆధార్ సమస్యలను పరిష్కరించండి
- రూ.2 లక్షలకు మించి రుణాలున్న రైతుల వివరాలు సేకరించండి
- వ్యవసాయాధికారులకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదేశం



**జడ్చర్ల, మేజర్ న్యూస్ :** అర్హత కలిగిన ప్రతి రైతుకూ రుణ మాఫీ చేయడానికి వీలుగా జడ్చర్ల నియోజకవర్గంలో పది రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. రుణమాఫీకి ఆటంకాలుగా మారిన ఫ్యామిలీ మ్యాపింగ్, ఆధార్ మిస్ మ్యాచింగ్ లతో పాటుగా రూ.2 లక్షలకు పైగా రుణాలు కలిగిన ప్రతి రైతును కలిసి వారి వివరాలు సేకరించాలని కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన వ్యవసాయాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జడ్చర్ల నియోజకవర్గంలో మొత్తం 26,662 మంది రైతులకు రూ.207 కోట్ల రుణాలను ఇప్పటి వరకు మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. అయితే ఫ్యామిలీ మ్యాపింగ్, ఆధార్ కార్డుల్లో తప్పులు దొర్లడం లాంటి కారణాలతో అర్హత కలిగిన రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్న ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని చెప్పారు. రుణ మాఫీ కోసం వ్యవసాయాధికారులు చేయాల్సిన ఫ్యామిలీ మ్యాపింగ్ ప్రక్రియ మొత్తం 5 వేల కుటుంబాలకు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 3 వేల కుటుంబాలకు మాత్రమే మ్యాపింగ్ చేయడం జరిగిందని, ఇంకా దాదాపు రెండు వేల కుటుంబాలకు మ్యాపింగ్ చేయాల్సి ఉందని అనిరుధ్ రెడ్డి చెప్పారు. ఆధార్ లో తప్పులు దొర్లడం, కాంటాక్ట్ నెంబర్లు అందుబాటులో లేకపోవడం కారణంగా ఫ్యామిలీ మ్యాపింగ్ లో ఆలస్యం జరుగుతోందని, అలాగే దీనికి సంబంధించిన యాప్ లో ఉన్న లోపాల కారణంగా కూడా మరికొంత ఆలస్యమౌతోందని వ్యవసాయాధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అయితే ఫ్యామిలీ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న వారు తమ రుణాలు మాఫీ అవుతాయో లేదోనన్న సందేహంలో ఉన్నారని, అయితే ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని అనిరుధ్ తెలిపారు. రూ.2 లక్షలకు పైగా రుణాలు కలిగిన వారు అదనపు మొత్తాలను బ్యాంకులకు చెల్లిస్తే వాటిలో రూ.2 లక్షల దాకా రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం జరిగిందన్నారు. అందుకే రూ.2 లక్షలకు పైగా రుణాలు కలిగిన రైతులు రూ.2 లక్షలకు పైబడి ఉన్న అదనపు మొత్తాలను చెల్లిస్తే రూ.2 లక్షల రుణమాఫీని విడతల వారీగా చేయించే బాధ్యత తనదేనని స్పష్టం చేసారు. కొంత మంది రైతులు పంట రుణాలు తీసుకొనే సమయానికి వారికి భూములు ఉండగా ఆ తర్వాత వాటిని వివిధ కారణాలతో అమ్ముకున్న కారణంగా ప్రస్తుతం వారికి పాస్ బుక్కులు లేని పరిస్థితి ఉందని అన్నారు. ఉదండాపూర్, వల్లూరు గ్రామాల్లో రైతులకు సంబంధించిన భూములను ప్రభుత్వం రిజర్వాయర్ కోసం తీసుకున్న కారణంగా వారి వద్ద కూడా పాస్ పుస్తకాలు లేవన్నారు. అయితే పాస్ పుస్తకాలు లేని కారణంగా కూడా రుణమాఫీ జరగడం లేదని వివరించారు. ఇలాంటి సమస్యలపై కూడా వ్యవసాయాధికారులు దృష్టి పెట్టాలని అనిరుధ్ రెడ్డి సూచించారు. 8 వ తేదీ మంగళవారం నుంచి 10 రోజుల పాటు అన్ని గ్రామాల్లో దీనిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలోనూ చాటింపు వేయించి రైతులందరికీ సమాచారం ఇవ్వాలని కోరారు. రుణమాఫీ కి అర్హత ఉండి కూడా రుణమాఫీ జరగని రైతులందరి వివరాలను సేకరించాలని ఆదేశించారు. తన నియోజకవర్గంలో అర్హత ఉండి కూడా రుణమాఫీ జరగని రైతుల సంఖ్యపై స్పష్టత వస్తే తాను ఈ విషయంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి మాట్లాడి ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ఏడీ ఆంజనేయులుతో పాటుగా జడ్చర్ల నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మండల వ్యవసాయ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల

- పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి
- సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ కురుమూర్తి



**పాలమూరు మేజర్ న్యూస్ :** గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సిఐటి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ కురుమూర్తి డిమాండ్ చేశారు. కార్మికుల పెండింగ్ వేతనం వెంటనే ఇవ్వాలని కోరుతూ సిఐటియూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు జరిగిన ధర్నాలో వివిధ కార్మిక కార్మిక ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ దసరా దీపావళి పండుగలు వచ్చిన గ్రామపంచాయతీ కార్మికులకు రెండు, మూడు నెలల నుండి జీతాలు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. నెలల తరబడి జీతాలు బకాయి ఉండడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా లోపల జీతాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, బట్టలు సబ్బులు నూనెలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ విజయేంద్ర బోయి కి అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం వెంకటేష్ గౌడ్ నాయకులు వెంకటయ్య, వెంకటేష్ గౌడ్, హనుమంతు, ఆంజనేయులు, వెంకటయ్య, చంద్రయ్య ,లక్ష్మమ్మ, వెంకటేశ్వర్లు, నరసింహులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ప్రభుత్వ అధికారుల సమీక్ష సమావేశం.



**నవాబుపేట్ మేజర్ న్యూస్:** నవబుపేట్ మండల పరిషత్ కార్యాలయంలో బ్లాక్ స్థాయి అభివృద్ధి ప్రణాళికలో భాగంగా రాబోయే రోజుల్లో జాతీయ పంచాయతీ అవార్డు విషయంపై గల'9'పథకాలను ఏవిధమైన అనుసంధాన కార్యాచరణను అనుసరించాలి అనే అంశాల పైన మండల స్థాయిలో గల ప్రభుత్వ అధికారుల సమావేశం సోమవారం ప్రజావాణి తదనంతరం ఎంపీడీవో జయరాం నాయక్ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి తహసిల్దార్ శ్రీనివాసులు ఎంపీవో బద్రునాయక్ మండల స్థాయిలో గల వివిధశాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు
మహబూబ్‌నగర్ జిల్లా : హన్వాడ, కౌకుంట్ల, మూసాపేట, అడ్డాకుల, భూత్పూర్
గద్వాల జిల్లా : ఉండవెల్లి, కేటిదొడ్డి, గట్టు, రాజోలి, మల్దకల్, ఇటిక్యాల, వడ్డేపల్లి, మానోపాడు
నారాయణపేట జిల్లా : నారాయణపేట ప్రతినిధి, రూరల్, ఊట్కూర్, గుండుమాల్
ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
8008622757